

శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 09
సంచిక : 10
వైశాఖ పౌర్ణమి
May 1, 2026

**నేపథ్యం:**

**గురు సంప్రదాయం**

| | |
|---|---|
| పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | **కోరికలన్నీ సిద్ధింప చేయు గురుకృప కలిగిన ఈ సత్సంగంలో శ్రీ సార్ సద్గురు సేవ చేయుటకు ఉండవలసిన సంసిద్ధత - గురుకృప అనుభవించే మార్గము తెలుపుతున్నారు.** |



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

గుకారో ప్రథమో వర్ణో మాయాది గుణభాసకః |

రుకారో ద్వితీయో బ్రహ్మ మాయాభ్రాంతి వినాశకః ||

'గు' అనే మొదటి అక్షరం మాయను, అజ్ఞానాన్ని మరియు ప్రకృతిలోని త్రిగుణాలను (సత్వ, రజ, తమో గుణాలను) సూచిస్తుంది.'రు' అనే రెండవ అక్షరం ఆ మాయను, అజ్ఞానమనే భ్రాంతిని పోగొట్టే పరబ్రహ్మ తత్త్వాన్ని సూచిస్తుంది. అజ్ఞానమనే అంధకారాన్ని ('గు') తొలగించి, జ్ఞానమనే వెలుగును ('రు') ప్రసాదించేవాడే గురువు అని ఈ శ్లోకం చెబుతోంది.

## విషయ సూచిక


**సంపాదకీయం** **4**

**భక్తుల అనుభవాలు** **12**

**శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు** **18**

04-02-1997 భవాని గారికి: పతియే దైవం - కర్మ సిద్ధాంతం 18


భవాని గారికి: ఇచ్చిన పని మనం క్షుణ్ణంగా నెరవేర్చాలి 22

**సార్ సత్సంగం** **27**

**మహాత్ముల వాక్యాలు** **34**













సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధగ్గాస్వామి

# సంపాదకీయం

ఓం సాయిరాం

**మే 2010 సాయిబాబా మానవపత్రిక (Pages 6,7) నుండి ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారు గారు రచించిన వ్యాసము** యధాతధం :

## మానవాళికి అందిన మహిత వరం శ్రీ సాయిబాబా

**——ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

తలచిన హృదయాలలో ఆరని మంటలనార్పి, తీయని ప్రేమను కురిసే నామం సాయిబాబా. ప్రతిఫల మెరుగని ఆయన జీవితం పరిపూర్ణ జీవితానికి ప్రతీక. అలౌకికమైన నిష్ఠ, కఠిన నియమాల తోనూ సాగిన ఆయన జీవితం అనుసరణీయం మాత్రమేకాదు - నిత్యానుస్మరణీయం కూడా. ఆయన కోపం, కరుణ రెండూనూ ఫలితం దృష్ట్యా చూస్తే భక్తుల బాగు పట్ల ఆయన చూపే శ్రద్ధకే నిదర్శనాలు. అందుకే సాయిబాబా అంటే ఆయన భక్తుల దృష్టిలో దివ్యశక్తి తమ పై కరుణతో దాల్చిన రూపం. .

ఆయన భక్తులలో అన్ని మతాల సంప్రదాయాలవారూ ఉన్నారు. అన్నింటినీ ఇముడ్చుకొన్నదే సాయి సంప్రదాయం. మతద్వేషంతో మంటగలుస్తున్న మానవాళికి మానవతా విలువల నొకవైపు బోధిస్తూ, అన్ని

సంప్రదాయాల ఆదర్శమూ, ధ్యేయమూ ఒకటేనని తన నిత్య జీవితాన్నే ఒక ఉదాహరణగా నిలిపారు శ్రీసాయి.

సాయిబాబా ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి జన్మించారన్న విషయం ఇదమిత్థంగా తెలిసినవారు లేరు. మొదట 16 ఏళ్ళ వయస్సులో 1854 సం||లో శిరిడీలో కన్పించారు. ఆ తరువాత 1918 విజయదశమి వరకూ శిరిడీలోనే వుండిపోయారు. శ్రీ సాయినాథుడు ఏ సంప్రదాయంవారన్నది నిస్సందేహంగా చెప్పడమూ కష్టమే. ఆయనకు 'సాయిబాబా' అన్న పేరు భక్తులు పెట్టినదే. వేషానికి ఫకీరు. నియమానికి కఠిన బ్రహ్మచారి. సాంప్రదాయానికి సర్వసముడాయాన, ఉన్నది పాడు పడిన మసీదులో, అందులో (పార్శీలకూ, హిందువులకూ ముఖ్యమైన) అగ్ని ఆరాధన, వాకిట తులసీ బృందావనం. ఐదిళ్లంటే ఇదే ఇళ్ళలో భిక్ష, తనవి అంటూ ఆయనకేమీ ఉండేవి కాదు - చేతిలోని దండం, చిలిమ్ గొట్టం, ఓ రేకు డబ్బా, జోలె, తొడుక్కొన్న పాడవైన పాత చొక్కా తలగుడ్డా తప్ప. ఆ ఫకీరును ఆశ్రయించిన వారిలో పండితులు, కోటీశ్వరులు, అతి సామాన్యులు, మహాత్ములుగా ఎంచబడినవారూ ఉన్నారు. ఆ భిక్షుకుని చూపుతో, మాటతో, స్పర్శతో లౌకికంగానూ ఆధ్యాత్మికంగానూ ఉన్నత స్థాయిని అందిన వారెందరో ఉన్నారు.

హీరాబేగ్, అన్వర్ ఖాన్ అనేవారు ఆధ్యాత్మిక పరిణితి కొరకు బాబాను ఆశ్రయించారు. ఖురాన్ గ్రంథం నుండి అరబ్బీ ప్రార్థనలు వారికి ఉపదేశించి బేగ్ ను కనాడ్ వద్ద, అన్వర్ ను  బాగ్దాద్ లోనూ నిజమైన ఫకీర్లుగా జీవించమని ఆశీర్వదించి పంపారు సాయి. ఢిల్లీ నివాసి యాకూబ్ అనే ముస్లిం సాధకుడు పవిత్రమైన బాబా సన్నిధిలో ఖురాన్ పఠించి పవిత్రుడయ్యాడు. హజరత్ దర్వేశా (ఔరంగాబాద్), ఫకీర్ అమీరుద్దీన్ (నాందేడ్) వంటి ముస్లిం గురువులు తమ శిష్యులను సాధనలో మెలకువలు తెలుసుకొమ్మనీ, ఆశీర్వాదాలు పొందిరమ్మని బాబా వద్దకు పంపేవారు. గంగగిర్, మోహర్ బాబా వంటివారు బాబాను గూర్చి - 'ఆయన కోహినూర్', 'ప్రపంచాన్ని ఆధ్యాత్మిక పథంలో నడిపేందుకు ఉన్న 72 మంది గురువులలో ఐదుగురు గొప్పవారు. వారిలో సాయి తలమానికం వంటివారు.' 'నాకు ఆయనను గూర్చి తెలిసినంత మీకు తెలిస్తే ఆయన ఈ సృష్టికే ఆదినాధుడని మీరే అంటారు' అన్న మాటలు అక్షర సత్యాలనడం స్వభావోక్తే.

కాశీనాథ్ ఉపాసనీశాస్త్రి (ఉపాసనీ బాబా, సాకోరి), నానాసాహెబ్ చాందోర్కర్, మూలేశాస్త్రి, దాసగణు మహరాజ్ లాంటి వారిని ఆయన (హైందవ) ఆధ్యాత్మిక సాధనా పరంగా సాన బెట్టారు. భగవద్గీతను భాష్యత్రయంతో సహ క్షుణ్ణంగా చదివాననే విద్యాగర్వం గల చందోర్కర్

గర్వాన్ని అతను వివరించలేని ఒక శ్లోకానికి (అధ్యాయము-4, 34 శ్లోకం) అసాధారణ వివరణనిచ్చి అణచారు, ఆ 'చదువురాని' బాబా. అలాగే వేద పఠనం మధ్యలో మంత్రం మరచిన దక్షిణదేశ పండితులకా మంత్రాలు అందించిన సాయికి, ఖురానే వచ్చునందామా ........, వేదమే వచ్చునందామా!

మసీదులో శ్రీరామనవమి, గురుపూర్ణిమ, అలాగే మొహరమ్ వంటి ఉత్సవాలు ఆయన అనుమతితో జరిగేవి. ఆ ఉత్సవాల్లో హిందూ ముస్లింలనే తేడాలేక అందరూ ఒకే తల్లి బిడ్డల్లా కలిసి మెలిసి పాల్గొనడం ఈ శతాబ్దంలోనే జరిగిన సత్యం! విచిత్రమేమీ కాదు!

ఆయన 'అల్లా మాలిక్' అనీ, 'అల్లా అచ్ఛాకరేగా' అనీ అంటూండేవారు. తన గురువు 'రోషన్ షా' అని కొందరితో, 'వెంకూసా' అని కొందరి తో చెప్పేవారు. హరినామం చేసి చేసి హరినయ్యానన్నారు. రాముడు, కృష్ణుడు మొ|| వారు చారిత్రక పురుషులనేవారు. అలాగే జ్ఞానేశ్వరి భగవద్గీత, భాగవతం, విష్ణు సహస్రనామం, గురుచరిత్ర పారాయణ చేయమని భక్తులకు చెప్పేవారు. తానున్న మసీదుకు ద్వారకామయి అని పేరు పెట్టారు. హిందూ భక్తులాయనను దత్తావతారంగా కొలిచేవారు.

*మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.*


బాబా మత ద్వేషాన్ని సహించేవారుకారు. మత మౌఢ్యం కలిగిన ఒక ముస్లిం మసీదులో నిద్రిస్తున్న హిందువులను చూపుతూ వారు ఇస్లాం సాంప్రదాయాన్ని మసీదునూ పాదరక్షలతో అపవిత్రం చేస్తున్నారనీ, కనుక వారినందరనూ చంపుతాననీ బాబాతో అన్నాడు. అందుకాయన వారిని తానే రమ్మని, అలా చేయమని ప్రోత్సహించాను, కనుక తనను సంహరించడం సరైన పని అని అడ్డుపడ్డారు. దానితో ఆ వ్యక్తి మరలి పోయాడు. అలాగే ఓ రోహిల్లా రాత్రులందు ‘అల్లాహో అక్బర్’ అని అరుస్తూ తమ నిద్రకు భంగం కలిగిస్తున్నాడని హిందువులు ఆరోపించగా అతని సంప్రదాయభద్దమైన ప్రార్థనావిధిని నిరసించడం సబబు కాదని బాబా మందలించారు. ముస్లిం మతం స్వీకరించిన ఒక యువకుడిని లాగి చెంప దెబ్బ కొట్టి "అల్లాను మార్చుకొన్నావటరా!" అని మండిపడ్డారు. మరో మారు చక్రనారాయణ అనే క్రైస్తవ ఉద్యోగి బాబా స్వీకరించే దక్షిణల వివరం సేకరించేందుకు ప్రభుత్వ ప్రతినిధిగా రాగా అతనిని భక్తులు దుర్భాషలాడారు. వారు అతనిని అలా విమర్శించినందుకు బాబా వారిని తీవ్రంగా నిరసించారు. పరదూషణ చేసే ఒకనికి పందిని చూపుతూ బాబా 'అది చేసే పనే నీవూ చేస్తున్నావు. ఇలా ఐతే శిరిడీ వచ్చి ఏం ఉపయోగం?' అని మందలించారు. మత సహనం, మతాలన్నింటికీ మూలమైన సత్యం ఆయనకు ప్రధానం.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తస్వామి

బాబా జీవితం సాధువుల, మహాత్ముల జీవితం ఎలా ఉండాలో చెప్పే ప్రత్యక్ష ప్రమాణం, ఆదర్శం. తమ సిద్ధాంతాలే గొప్పవని వాటిని సామాన్యులపై రుద్దే ఎందరో భాదగురువుల, ఆచార్యుల, 'భగవానుల' బారి నుండి రక్షించి నిజమైన బోధ గురువులను ఎంచుకొనేందుకు పనికివచ్చే గీటురాయి ఆయన జీవితం. వారి జీవితంలో వ్యక్తమయ్యే నాలుగంశాలు పేర్కొనదగ్గవి.

1) హిందూ భక్తులకు బాబా వారి ఇష్టదైవాలైన రామ, విఠల, దత్త, మారుతి రూపాలలోనూ, శ్రీ అక్కల్ కోట స్వామి, గురు ఘోలప్ స్వామి మొదలైన గురువుల రూపంలోనూ దర్శనం ఇచ్చారు. అన్ని జీవులలోనూ, అన్ని ప్రదేశాలలోనూ, తన ఉనికిని నిరూపించాయి, ఆయన లీలలు. అనాటి మహాత్ములే ఆయనకు చేయెత్తి మొక్కారు. కోటీశ్వరులాయన వాకిట నిలిచారు. బాబా "నేను భగవంతుని బానిసను. పేద ఫకీరును." అనే వారాయన. "నేనే భగవంతుడిని" అనే నకిలీ బాబాలకూ, 'మహాత్ములకూ' ఆయనకూ ఎంత తేడానో! ఆయన సముద్రం, వారో, మురికి కాలువలు.

2) 'రేపటిగూర్చి ఆలోచించకు' అన్న క్రీస్తు సందేశం, నిజమైన సాధువుకు ఆశ్రమ మఠాది నిర్మాణం, శిష్యకోటిని కూర్చుకోవడం, తన కొరకుగాని, పవిత్ర కార్యాలకనిగానీ, ధన వస్తు సముదాయాన్ని సేకరించడం, సన్మానాదుల నందుకొనడం నిషిద్ధమని చెప్పిన హిందూ శాస్త్ర

గ్రంథాలలోని నియమాలనీయనవలే ఎందరు పాటించారు? రోజూ సాయంకాలం వరకూ భక్తులిచ్చే దక్షిణల మొత్తాన్ని (ఆ రోజులలోనే సుమారు 3, 4 వందల రూపాయలుండేది!) తినుబండారాలనూ, విలువైన వస్తువులనూ ఆ రోజుకారోజే పేదలకు పంచేవారు బాబా. తనకోసం జోలెతో ఐదిండ్లు భిక్ష చేసేవారు. అందుకే ఈ నాటి నకిలీ స్వాముల్లాగా ఆయన 'ధనస్వాములు' కాలేకపోయారు.

3) భక్తులాయనకు ఒక పల్లకీ, గుర్రం, రధం - అన్ని హంగులూ సమకూర్చారు. ఐనా శిరిడీలో ఆయన ఉన్న ఆరుపదేండ్లలోనూ ఒక్కసారి కూడా వాటిని ఆయన వినియోగించక, చెప్పులు కూడా ధరించక చిరిగిన గుడ్డలతోనే ఊరంతా తిరిగేవారు. అడుగు దూరం వెళ్ళాలన్నా విదేశీ కాడిలాక్ కార్లు కావాలనే ఈ 'మహాత్ముల' వరుసలో ఆయనెలా నిలబడగలరు!

4) 'ఇతర మహాత్ములంతా మోసగాళ్ళు' గారడీలవారు హిప్నాటిస్టులు' అని ఇతరులపై బురద చల్లుతూ, పైగా తాను తప్ప తరింపజేయగల వాడు లేడనే ఈ కుహనా మహాత్ములకూ, "నీ గురువుపై అచంచల విశ్వాసంతో అట్టి పెట్టుకో, ఆయన సామర్థ్యం ఎంత తక్కువదైనా సరే" అని బోధిస్తూ, ఆరతిలో తుకారాం వంటి మహాత్ముల గూర్చిన పాటలు భక్తులు పాడే

సమయంలో ఎంతో భక్తిగా చేతులు జోడించి వినయంగా కూర్చొనే బాబాకు సాపత్యమెక్కడ? వీరికి ఆయన జీవితమే ఒక గుణపాఠం.

బాబా చూపిన బాటలో నడుద్దాం, ఆయన బిడ్డలమనిపించు కొందాం. ఆయన కృపకు అర్హ్హులమౌదాం.

*నేను శిరిడీలో వున్నాను, అని అనుకుంటే నన్ను అసలు చూడనట్టే.*

ఈ వ్యాసము **మే 2010 సాయిబాబా మానవపత్రిక నుండి.**

**భక్తుల అనుభవాలు**

ఓం సాయిరాం

**శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టార్ రచించిన శ్రీ సాయి లీలామృతం "సాయి - సాంప్రదాయం" అధ్యాయము నుండి:**

ఒక పేద బ్రాహ్మణుడు బాబాను ధనసహాయం కోరాడుగాని, లోలోపల ఆయన ముస్లిమనే శంకగూడ వున్నది. మొదట కొంతసేపు సాయి పట్టించుకోలేదు గాని, చివరికొక కాగితపు పొట్లమిచ్చి, "దీనిని యింటికి తీసుకుపోయి నువ్వు, బిడ్డలూ తినండి. దారిలో విప్పి చూడవద్దు" అన్నారు. అతడు తన ఊరికి బయలుదేరాడు. పోను పోను కుతూహలమెక్కువై చివరికొక కాలువ గట్టు చేరి, ఆ పొట్లం విప్పి చూచాడు. అందులో పొట్టేలు మాంసమున్నది. వెంటనే దానిని కాలువలో పారేశాడు. నీటికి తగులగానే ఆ

మాంసం బంగారంగా మారి, చూస్తుండగా మునిగిపోయింది. అతడు నిరాశగా తన పైపంచ ఆ కాలువలో పిండుకున్నాడు. అపుడందులో ఒక సన్నని బంగారుపోగు కన్పించింది. సద్గురువు యొక్క వేష భాషలు పట్టించుకోక, ఆయనను విశ్వసించినవాడే కృతార్థుడౌతాడు.

సాయి మతమౌఢ్యాన్ని నిరసించేవారు. భక్తులాయనను మొదట పూలతో మాత్రమే పూజించేవారు. ఒక్క మహల్సాపతి మాత్రమే ఆయన కంఠానికి చందనమద్దేవాడు. ఒకనాటి రాత్రి అతనికి స్వప్నంలో ముఖానికి చందనం ధరించి సాయి దర్శనమిచ్చారు. మరురోజు నుండి అతడు సాయిని అలానే అలంకరించ సాగాడు. అతనిని వారించమని ముస్లింలు కోరినా ఆయన అభ్యంతరం చెప్పలేదు. వారిలో కొందరు సంగమనేరులోని ఖాజీతో సంప్రదించి, సాయి ముఖాన చందనమద్దినవారిని దండించదలచారు. మొహుద్దీన్ తంబులీ ఆ విషయం మహల్సాపతికి చెప్పాడు. మరురోజతడు మసీదు ముంగిటనుంచే సాయిని పూజిస్తున్నాడు. సాయి అతనిని, “లోపలకొచ్చి నా ముఖాన చందనమద్దు, ఎవరడ్డగిస్తారో చూస్తాను!” అని గద్దించారు. ఆ ముస్లింలు భయపడి వెళ్ళిపోయారు. హిందువులు నిర్భయంగా తమ మతానుసారం సాయిని ఆరాధించసాగారు.


వేరు మతాలవారికి దైవం వేరైతే, మతం మార్చుకోవడం ద్రోహము, లజ్జాకరము. దైవమొక్కడే అయితే మతం మార్చుకొనడం అనవసరము. ఒక

హిందూ యువకుణ్ణి ముస్లింగా మార్చి, గర్వంగా బాబాకు చూపాడు బడేబాబా. సాయి ఉగ్రులై, ఆ యువకుని చెంపమీద కొట్టి, “నీ అబ్బను మార్చుకున్నావుట్రా?” అన్నారు.

హిందూ భక్తులకువలే, పాత్రులైన ముస్లిమ్‌లను గూడ సంస్కరించి అనుగ్రహించేవారు సాయి. ఎన్నోసార్లు మక్కాయాత్ర చేసిన ఒక ముస్లిమ్ హాజిసిద్ధిక్ సాల్కే శిరిడీ వచ్చాడు. అతనిని చూస్తూనే బాబా ఉగ్రులై రెండు నెలల వరకూ అతనిని మశీదులో ప్రవేశించనీయలేదు. ఒకరోజు శ్యామా అతని తరపున ప్రార్థిస్తే, “ఆ హాజీ బార్వే బావిదగ్గరకు సన్నని కాలిబాటన వస్తాడా?” అన్నారు బాబా. హాజీని అడిగితే అతడు వస్తానన్నాడు. అది విని సాయి, “నాలుగు వాయిదాలలో రూ. 40,000లు చెల్లిస్తాడా?” అన్నారు. శ్యామా అడిగివచ్చి, అతడు 40 లక్షలైన యివ్వడానికి సిద్ధమేనని చెప్పాడు. ఈసారి ఆయన, “మేమొక మేకను కోస్తాము. అతడికి తల, పిరుదులు, వృషణాలు, యేది కావాలో కనుక్కో!” అన్నారు. “బాబాగారి మట్టికుండలోని చిన్న రొట్టెముక్క చాలు” అని కబురు చేశాడు హాజీ. అది విన్న సాయి పట్టరాని ఆవేశంతో మసీదులోని పాత్రలన్నీ బయటపారేసి, కఫ్నీ చేతులు పైకి మడుచుకొంటూ, కోపంగా హాజీవద్దకొచ్చి, “ఇక్కడున్నది ఎవరనుకున్నావ్? మక్కా యాత్ర చేశానని గర్వమా? ఖురాన్ అలా చెప్పిందా? ఇంతా చేసి నీవు నన్నెరుగవు!” అన్నారు. హాజీ భయంతో









వణికిపోయాడు. బాబా మసీదుకు తిరిగివచ్చి తమ వద్దనున్న పైకంతో పండ్లుకొని హాజీకి పంపి, రూ.50/-లు కూడ యిచ్చారు. నాటినుండి అతడు మసీదు ప్రవేశించటానికి సాయి అనుమతించారు. ఆయన చెప్పిన మేక శరీరంలోని భాగాలు ధర్మార్థకామాలు; హాజీ కోరినది సాయి నిత్యమనుభవించే మోక్షం. 'సాయి పాత్రలోని చిన్న రొట్టెముక్క' కోరడంలో హాజీ గురూచ్ఛిష్ఠం కోరాడు; సాయి చెప్పిన కాలిబాట కఠోరమైన సాధన. రూ.40,000/- లు అంతఃకరణ చతుష్టయం; కాని అవి మొదట తాను హాజీననే గర్వంలో చిక్కుకున్నాయి. అతడు తమను శరణుపొందాకనే, సాయి కోపంతో అతని గర్వమణచడం సరియైన గురువుల పద్ధతి. అది నెరవేరగానే తమ సంతోషానికి సంకేతంగా సాయి పండ్లు, కానుక ప్రసాదించారు.

ఇలానే హిందువులను గూడ సంస్కరించారు సాయి. బల్వంత్‌నాచ్నే 1915లో ఒకనాటి రాత్రి 8 గంటలకు సాయిని దర్శించి ముక్తి మార్గం చెప్పమని ప్రార్థించాడు. "దేవపూర్ వెళ్ళి, అక్కడ అనాదిగా మీ పూర్వీకులు అర్చిస్తున్న శిలలను ఆశ్రయించు" అన్నారు సాయి. అతనికేమీ అర్థంగాలేదు. ఇంటికి వెళ్ళాక, నిజంగానే వారి పూర్వీకులు దేవపూర్లో కొన్ని విగ్రహాలను పూజించేవారని అతని తండ్రి చెప్పాడు. ఐదు తరాలకు ముందు వారి పూర్వీకుడు, బాబా ప్రయాగ్ తమ 70వ యేట సంతానం కోసం ఏకనాధుని


శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టార్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి

శ్రీ దర్గాస్వామి

శిష్యుడైన 'బాబా భాగవత్' అనే మహాత్ముని త్రయంబకేశ్వరంలో దర్శించాడు. ఆయన ఆశీస్సులతో కలిగిన పసిబిడ్డను దేవపూర్ తీసుకువెళ్ళి, 'జ్ఞానేశ్వరి' వ్రాతప్రతి చేతిలో పెట్టారు భాగవత్. వంశం నిలబడితే ఆ వంశస్థులు, భాగవత్ వంశస్థులనుండి ఉపదేశం పొందుతామని ఆ పూర్వీకుడు మ్రొక్కుకున్నాడు. ఇదంతా సాయికి తెలియడమే ఆశ్చర్యం! అయినా చాలా సం॥రాలకు నాచ్నే 1927లో నానుమహరాజ్, అనే 15 సం॥ల మహాత్ముని దర్శించాడు. ఆయన, "దేవపూర్ వెళ్ళావా?" అన్నారు. నాచ్నే ఆశ్చర్యపోయి, "ఆ గురువంశంలో నాకంటె పెద్దలెవరూ లేరని వెళ్ళలేదు" అన్నాడు. "అయితేనేం? నా గురువు శ్రీదోయిపాడే నాకంటే చిన్నవారు. నీ గురువు పేరు భాగవత్" అన్నారు ఆ మహాత్ముడు. నాచ్నే త్వరలో దేవపూర్ వెళ్ళి ఉపదేశం పొందాడు. సంవత్సరం తరువాత 'నానూ మహరాజ్' బొంబాయి వస్తున్నారని అతనికి తెలిసి స్టేషన్‌కు వెళ్ళాడు నాచ్నే. 'నానూ మహరాజ్ అతనికి తమ గురువైన 8 సం||లు శ్రీపాద దోయిపాడే' గారిని చూపారు. తర్వాత ఈ శ్రీపాదులు కొంతకాలం గుంటూరులో మెట్రిక్ చదివారట.


**ఈ భక్తుల అనుభవాలు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టార్ రచించిన శ్రీ సాయి లీలామృతం "సాయి - సాంప్రదాయం" అధ్యాయము నుండి.**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

ఓం గురుభ్యోనమః

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

### 04-02-1997 భవాని గారికి: పతియే దైవం - కర్మ సిద్ధాంతం

ఓం

గొలగమూడి

04-02-1997

పూజ్య గురుబంధు శ్రీమతి భవాని గారికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలగవలెనని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం. శ్రీ స్వామివారి కృపవలన నేటికి లెటర్ రాయగలిగాను. మీ కుమార్తె ఆరోగ్యం ఎలా ఉంది? అమ్మా, నాన్నగారు, నువ్వు క్షేమమేనని తలుస్తాను. ఆచార్య భరద్వాజ మాస్టర్ గారు వ్రాసిన పరిప్రశ్న అన్న గ్రంథములో (ప్రథమ ముద్రణ 1990), 128వ పేజీలో ఉన్న ప్రశ్నా జవాబు మీరు తప్పక చదవండి. మీకు తప్పక ఊరట కలుగుతుంది. అందులోని ఇది **ప్రశ్న:** మీరు స్త్రీలకు పతి తరువాతనే దైవమన్నారు. మీరన్నది సాధువర్తనులైన భర్తల విషయంలో నిజం కావచ్చు. కానీ మానవత్వమే లేక వర్తించు వారి విషయంలో అదెలా సమంజసము?

**జవాబు:** పురుషుల విషయంలో కూడా "ఒకసారి గురువు అని తలచి ఆశ్రయించిన తర్వాత ఆ గురువుని ఎట్టి పరిస్థితుల్లోనూ త్రిమూర్త్యాత్మకుడు గాను, పరబ్రహ్మము గాను విశ్వసించి సేవించాలనే ఆర్ష ఆచారము"

వర్తిస్తుంది. ఉపనిషత్తులలో ఎందరో గురువులు ఎంతో అమానుషంగా, శిష్యులను బాధ పెట్టినట్లు ఉంది. అయినా ధైర్యాన్ని (ధీ అంటే బుద్ధి ని) విడువక వారిని నిశ్చల విశ్వాసంతో సేవించి కృతార్థులైన వారెందరి గురించో వర్ణించబడ్డది. అలా కాక "ఆ గురువు ను విడిచిన వాడి ముఖం చూడకూడదు" అన్న విషయం శ్రీ గురుచరిత్రలో చూడవచ్చు. అలానే దీపకుడనే శిష్యుణ్ణి కాశీలో కుష్టు వ్యాధితో బాధపడుతున్న గురువు ఎంతో క్రూరంగా చిత్రహింస పెట్టినా చలించక సేవించి కృతార్థుడైనట్లు చెప్పబడింది. అసలు జరిగేదేమంటే భాగవతంలోని బిక్షుగీతలో చెప్పినట్లు "మనకు ఎవరి వల్ల ఏ కష్టం వచ్చినా అది పూర్వకర్మ ఫలితమే!" ఆ కష్టము అనుభవించవలసిన పాప కాలం వచ్చినప్పుడు ఏ విధంగానైనా అది తప్పదు. మంచి గురువునాశ్రయించిన శిష్యుడి పాపకర్మ క్షయం కావడానికి, మనను వారే అంతగానూ కష్టపెడతారు. వారు ఆ కర్మ ఫల ప్రాప్తికి నిమిత్తమాత్రులవుతారు. ఈ వివరం యోగి మిలారేపా చరిత్రలో చూడవచ్చు. ఆ స్థితిలో శిష్యుడు అచంచల విశ్వాసంతో గురువును సేవించాలి. అలాంటి వారే కృతార్థులయ్యారు. ఇలా కాక ప్రారబ్ధవసాన అజ్ఞుడైన కపట గురువు నాశ్రయించినా, ఆ పాపకర్మ ఫలమే వారి వలన కలిగే బాధ రూపంలో అనుభవం అవుతుంది. ఇప్పుడు కృత్రిమం గాక సహజము, అమాయకము అయిన విశ్వాసంతో సేవించగలిగిన వాడికి కొత్త దోషం సంక్రమించదు. ఇంకా కర్మ క్షాళనమవుతుంది. మీరు చెప్పినటువంటి దుష్టుడైన భర్త

విషయము అంతే! అటు కపట గురువు దాపరించిన పురుషుడు కానీ, ఇటు దుష్టుడైన భర్త దాపురించిన స్త్రీ కానీ, వారి పూర్వకర్మఫలంగానే అలాంటి వారి పాలిట పడతారు. సర్వ కర్మఫల ప్రదాతయైన భగవంతుడు, సర్వగతుడై వీరి కర్మల ననుసరించి వారికి ఆ రూపంలో తారసిల్లి వారి కర్మ ఫలాన్ని వారికి అందజేస్తాడు. ఆ స్థితిలోనూ అచంచలమైన పాతివ్రత్యంతో పతియే దైవమని విశ్వసించి సేవించగలిగిన స్త్రీలు బ్రహ్మజ్ఞానాన్ని పొందారు. ఇందుకు చివటం అమ్మగారు ఒక చక్కని ఉదాహరణ. ఇలా సేవించలేని వారు కనీసం నిర్లిప్తంగానైనా సహనంతో ఉండాలి. అంతే గాని ద్వేషాన్ని వహిస్తే ఆ కర్మబంధం వలన మరుజన్మలో ప్రతీకారానికై మరల ఆ వ్యక్తితోనే ఋణం చేత బాధపడతారు. ఈ విధంగా చెన్నబసప్ప వీరభద్రప్ప కథ వలనే అవుతుంది వారి గతి. అందుకే సాయి సూక్తులలో ఇతరులు మనను బాధిస్తే మనము ఎలా ఉండాలో చూస్తే తెలుస్తుంది. పురాణాలలో దుష్టులైన భర్తలను సేవించిన పతివ్రతలు కూడా ఉన్నతి కొంచిన ఉపాఖ్యానాలు ఈ విషయాన్నే వివరిస్తాయి. భగవద్గీత యుద్ధం వంటిది కూడా రాగద్వేషాది ద్వంద్వరహితంగా స్వధర్మంగా యుద్ధం చేయాలని చెబుతుంది. ఈ విషయంలో ఎన్నో లేఖలోనైనా వివరించలేనంత ఇతర అంశాలు ఉన్నాయి. ఎప్పుడైనా అవకాశం వస్తే ముఖతః వివరంగా చర్చించవలసిందే! భార్య ఎంత గయ్యాళి అయినా శ్రీ రామానుజాచార్యులెంత ఓర్పుతో ఉన్నారో చూడండి. ఆమెకై ఆమె వెళ్లిపోయినప్పుడు అదే భగవత్ సందేశంగా తలచి

ఆయన సన్యాసించారు. ఇంకా ఈ వివరాన్ని "శ్రీ సాయినాథ ప్రబోధామృతం" లోనూ, త్వరలో ప్రచురణ కానున్న గురుగీతలోని అనుబంధములోనూ చూడండి. ఇలా విశ్వాన్ని భగవంతుడిగా దర్శించగలిగాడు - భాగవతం ఉద్ధవగీత లో వర్ణించబడిన అవధూత. ఇలా దర్శించలేని మనకది మాయా స్వరూపంగానే అనుభవమై మనల్ని సంసారంలో బంధిస్తున్నది. కష్టాలలోను, సుఖాలలోను సములై సర్వత్రా భగవంతుడిని చూడగలగాలనే గీతా ఆది గ్రంథాలన్నీ చెప్పేది. "మానవుడిచ్చింది నిలవదు. భగవంతుడిచ్చింది నశించదు." అన్న సాయి వాక్యాన్ని బాగా మననం చేసుకొని ఆచరించి తరించవలెనని మనవి.

గట్టున ఉండి మేము ఎన్నైనా చెప్పవచ్చు. నీటిలో దిగి ఈత కొట్టే వారికి కష్టం తెలిసే మాట వాస్తవమే, కానీ శ్రీ సాయిని నమ్మిన వారికి కష్టాలు కలకాలం ఉండవనేది నిత్య సత్యమైన విషయం. మీకు మీ బిడ్డలకు శ్రీ సాయీశుని ఆశీస్సులు కలిగి సుఖశాంతులలో, తృప్తి ఆనందము సంపూర్ణంగా కలగవలెనని ప్రార్థిస్తూ


మీ సోదరుడు

పెసల సుబ్బరామయ్య

**************** సద్గురు దేవా శరణం శరణం**************








## భవాని గారికి: ఇచ్చిన పని మనం క్షుణ్ణంగా నెరవేర్చాలి

ఓం

భవాని గారు!


ఏం మాటలు అండి? ఎలా జీవించాలని వ్రాశారు! అదేమిటండి. చదివేస్తే ఉన్న మతి పోయిందట! ఇల్లు, వాకిలి, ఆస్తిపాస్తులు లేక ఆరోగ్యం సరిలేని వారు కోట్ల మంది ఉన్నారు. వాళ్లేమనాలి? నేను పది సంవత్సరాల పిల్లవాడుగా ఉన్నప్పుడు మా నాన్న పక్షవాతం వల్ల మంచాన ఉన్నాడు. 1) ఆయనకు అన్నీ మంచాన చేయాలి. 2) ఆస్తిపాస్తులు లేవు. 3) ఏ రోజు చిల్లర అంగడికి వచ్చిన డబ్బుతో వడ్లు దంచి వాటిని వండి మమ్ములను నలుగురు బిడ్డలకు, మా నాన్నకు పెట్టాలి, మా అమ్మ తినాలి. కట్టెలు మా అన్న, నేను తేవాలి. మా అన్న అలిగితే నేను, మా అమ్మ తేవాలి. మా చెల్లెలిని ఎనిమిది సంవత్సరాల బిడ్డను ఇంట్లో వదిలి పోయేవాళ్ళము. ఒక గంట, రెండు గంటల మధ్యాహ్నం సమయంలో అంగడికి ఎవరూ రాని సమయంలో మా అమ్మే కట్టెలు తెచ్చి వండాలి. బాడుగ ఇల్లు ఖాళీ చేయమని వాళ్లది ఒక పోరు. ఇవి గాక మా నాన్న పక్షవాతం వల్ల అంగడికి వచ్చిన వారిని తిట్టేవాడు. చేతిలో చిల్లి గవ్వలేదు. మా అమ్మ తరుపున అన్నలు, తమ్ముళ్లు మంచి ఆస్తిపరులు. మా గ్రామంలోనే ఆమె పెద్దన్న ఒక అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మేము బీదవారమని ఆయన


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

అత్తగారింటికి వస్తే కూడా మా ఇంటికి రాడు. అభిమానవతి అయిన మా అమ్మకు అది ఒక బాధ. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు మా అన్న పెండ్లికి వచ్చింది. ఇంత బీదవారికి పిల్ల నెవరు ఇస్తారు? మా అన్నగారు చెడుగుడు ఆటలు, బీడీలు త్రాగడం ఊరిలో అందరికీ తెలుసు. ఆయనకు కాని వారే ఎక్కువ... అందరితో తగువులే! మరి పెండ్లి ఎలా అవుతుంది? అదొక బాధ. ఈ లోగా నన్ను చదివిస్తావా? లేదా? అని నేను నిరాహార దీక్షలు. ఆమె బాధ నాకు అప్పుడు తెలిసేది కాదు. ఆమె తెలియ నిచ్చేది కాదు. బడిలో అందరి పిల్లల కంటే గొప్పగా ఉండాలని ఆమె ఆశ. నేను మాత్రం చదువులో అలాగే ఉండేది. అప్పుడే నాకు ధనుర్వాతం జబ్బు వచ్చింది. చిన్న కొడుకు అయిదు సంవత్సరాల బిడ్డ చనిపోయాడు. ఓ తల్లి! ఆమె బాధ ఇప్పుడు నేను తలచుకుంటే నాకే కళ్ళ నీళ్లు వస్తున్నాయి. ఆమె ఎలా భరించిందో ఏమో? చెప్ప సఖ్యం కాదు. రోజు రాత్రి 8 గంటల వేళ లాంతరు తీసుకొని నన్ను తీసుకు వెళ్లి ఊరి చివర బంగ్లాలో కాపురం ఉండే తమ్ముళ్ల దగ్గర ఇంగ్లీషు చెప్పించేది. రాత్రి పది గంటలకు మరల ఒక్కతే వచ్చి నన్ను ఇంటికి తీసుకొచ్చుకోవాలి. చిన్నగా భగవంతుని దయవలన కట్నం లేకుండా మా చెల్లిని మా మేనమామ చేసుకున్నాడు. మా అన్నకు కూడా పెండ్లి అయింది. కానీ ఆ వచ్చిన ఆమెకు ఈమె పడ్డ కష్టాలు ఏం తెలుస్తాయి? ఎప్పుడూ తగువే! అయితే మా అన్న తన భార్య పక్షం. అభిమానురాలైన మా తల్లి వీళ్లిద్దరినీ లెక్క చేసేది కాదు. నేను చదువుకొని ఉద్యోగరీత్యా

దూరమయ్యాను. ఇంట్లో అత్తా, కోడలు, అన్న! ఇలాంటి కష్టాలలో ఆమె ఎలా భరించిందో! మా కొరకు ఆమె ఎంత నిబ్బరంగా జీవించిందో చూడండి. ఇన్ని గర్భ దరిద్రపు పరిస్థితులలో కూడా ఆమె నిత్యం ఉదయం రాత్రి తప్పక దీపారాధన చేసి నైవేద్యము, హారతి ఇచ్చేది. తన పరిస్థితి ఏమని భగవంతునికి చెప్పుకునేదో తెలియదు. ఊరందరికీ మా అమ్మ అంటే అభిమానము. ఎందుకో తెలుసా? మన కష్టాలు లాంటిదేగా వారి కష్టం! అని సహాయం చేసేది. పెద్ద రైతుల భార్యలు కూడా ఆ కాలంలో వచ్చిన అల్లుని కోసం పవిట చాటున గిన్నె తీసుకొని మా అమ్మ దగ్గరకు వచ్చేవారు. లేదు అనకుండా కూరగాయలు, లేకుంటే పచ్చడి గాని అదీ లేకుంటే ఊరగాయ అయినా పెట్టి పంపేది. అర్ధరాత్రి అప్పుడు సొంటి, వాము వాటర్ లాంటి వాటికి వచ్చినా తన నిద్రాభంగానికి బాధపడకుండా ఎంతో ప్రేమగా ఆ వస్తువు ఇచ్చేది. వాళ్లు ఆ సమయంలో డబ్బులు తీసుకురారు. మా అన్న కసిరికొట్టేవారు. ఆమె ఇటు ఈయనను, అటు వాళ్లను సర్ది చెప్పి పంపాలి. మరి ఈమె కష్టాలను మనం భరించగలమా అమ్మా? ఇప్పుడు ఇంట్లో గ్యాస్ పొయ్యి మీద అన్నం వండాలంటే బాధపడే వాళ్ళమే! ఆ రోజుల్లో దంపుడు బియ్యం. ఇప్పుడు మిషన్లో ఆడిన బియ్యం. కరెంట్ దీపాలు లేవు మా అమ్మకు. నేను ఉద్యోగం చేసేటప్పుడు కరెంటు దీపం చూసింది.

నీవేమీ దిగులు పడవద్దు. అసలు బాబాగారు, మాస్టర్ గారు, శ్రీ స్వామి వారు త్రిమూర్తులు. పిలిస్తే పలుకుతారు అంటే భయమెందుకు? పిలిస్తే పలుకుతుంటే భయం ఎందుకు? బాధ ఎందుకు? గుడ్డకు బాగా మురికి ఉంది. చాకలివాడు బండకేసి బాదితే కానీ ఆ మురికి వదిలి బాగా గుడ్డ ప్రకాశించదు. మన సంగతీ  అంతే! బ్యాంకులో ఎన్నో జన్మల కింద చేసిన బాకీలన్నీ ఈ జన్మలో తీరిపోతున్నందుకు సంతోషించండి. కర్మ, ఋణానుబంధాలు క్షాళణ అవుతున్నందుకు తృప్తిగా సంతోషించమంటారు మాస్టర్ గారు. ఋణానుబంధాన్ని అనుసరించి కలిగిన బిడ్డలకు సరైన విధంగా విద్యాబుద్ధులు నేర్పి ఋణవిముక్తులము అవడమే కావాలి కదా! మన ప్రయత్నాలు మనం చేయక తప్పదు. ఎందరు ఎన్ని అడ్డుపెట్టినా వాళ్ళు ఏమి కావాలో అది అయ్యి తీరుతారు. నన్ను చదివించకూడదని మా అన్న పట్టుబట్టాడు. నేను ప్రతిరోజు 8 మైళ్ళు, 10 కిలోమీటర్లు నడిచి నెల్లూరు పోయి కాలేజీ నుండి వచ్చేవాడిని. ఎందుకో భగవంతుడు కరుణించి హాస్టల్ లో చేర్చుకున్నారు. నేను బీఎస్సీ, బీఈడీ అయి హైస్కూల్ టీచర్ని అయ్యాను. నేను చదువుకున్న బడి లోనే టీచర్ అయ్యాను, సి. ఏ. ఎం. హై స్కూల్ నెల్లూరు. ఎవ్వరు ఆపలేరు. అడ్డాలు పెట్టిన వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. మా అమ్మ మాత్రం చిక్కుడు చెట్టుకు పందిరి వలె, చివరి వరకు అండగా నిలిచింది. నీవు కంటతడి పెట్టకుండా, ధైర్యంగా మా అమ్మ లాగా నీవు నీ బిడ్డల కొరకు జీవించి నీ బిడ్డల బంగారు భవిష్యత్తుకు తోడు

ఉంటే శ్రీ సాయి, మాస్టర్ గారు నీ ధర్మాన్ని నీవు నెరవేర్చావని సంతోషించి ఆశీర్వదిస్తారు. ప్రపంచం తో పని ఏమిటి? మనకు ఇచ్చిన పని మనం క్షుణ్ణంగా నెరవేర్చాలి. ఆస్తిపాస్తులు లేకుండా మా అమ్మ పడ్డ శ్రమలో వందో వంతు చేసి నీ బిడ్డలకు నీడగా తోడుగా నిలిచి, దేవునితో మన ధర్మం నెరవేర్చామని దేవునితో ఢీకొని చెప్పుకోగలగాలి! అంతేగాని అధైర్యం, నిస్పృహ, బాధతో పనిచేయడం మాస్టారు, శ్రీ సాయి, శ్రీ స్వామి మెచ్చరు. మనకు మన బిడ్డలు-దేవుడు. అంతకు తప్ప ఈ ప్రపంచమును పట్టించుకోకుండా సంతోషంగా ఉండాలమ్మా!

శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

**************** సద్గురు దేవా శరణం శరణం**************

**సార్ సత్సంగం**

GV : మాకు కూడా అదే ఈజీగా ఉంది సార్ !

సార్ : అదే ఈజీ! ఇవన్నీ శాస్త్రాల చదివి, చింతకాయ అంత మనం ఊడదీసి, అదంతా ఆచరించేది అయ్యే పనా? చచ్చే పనా ?

GV : అలా అయితే మమ్మల్ని కూడా తోసేయండి సార్!

సార్ : ఆయనే తోసి పారినోకడా! తోసేసి ఉండలా నిన్ను. ఇక్కడనే ఇల్లు


కట్టి, శుద్ధంగా పడి ఉండు ఇక్కడే అనే. ఆయన యొక్క ప్లాను, మన ప్లాన్ కి అందుతుందా! మన ప్లాన్లకి అందదు. ఆ టైము వస్తుంది. ఆ టైం వచ్చినప్పుడు, ఆయనే తీసుకొచ్చి పెట్టుకుంటాడు. ఇప్పుడు నన్ను పెట్టుకోలా? నేను ఎప్పుడైనా 15 వేల రూపాయల జీతం వదులుకొని, ఇక్కడికి వస్తాం అనుకున్నాను అయ్యా? బస్సు ఎక్కటమే, అయిపోయింది. పూర్తిచేసి పారి నూకి నాడు (నవ్వుతూ)..సంచి ఎత్తుకుంటే ఆ కొరవ కూడా పూర్తి చేసినాడు. ఆయనే చేస్తాడు, ఆయనే చేస్తాడు. కానీ ప్రవృత్తుల బాగుంటే, అన్ని అయిపోతాయి నాయనా. ప్రవృత్తి అంటే నేను పెద్దవాడిని కావాలా, వాళ్ళదీ, వీళ్ళది అందరిదీ నా జేబులో పెట్టుకోవాలా! ఉద్దేశం ఎప్పుడు ఉండదో, దాంట్లో చెప్తాడు, ఆహార శుద్ధి అని చెప్తాడు, ఆహార శుద్ధి అంటే ధర్మంగా అర్జించినదాన్ని ఉపయోగించుకోవటం. ధర్మంగా ఆర్జించిన దానిని (మాత్రమే) ఉపయోగించుకోవటం. ఆ మాట గాని, ఆహార శుద్ధి అని, వచ్చిందంటే భరద్వాజ మాష్టారు ఆ రోజు ఇంక ఏది మాట్లాడడు. ఈ ఆశ్రమం వాళ్ళు, పీఠాధిపతులు, వాళ్ల గురించి ఎత్తుకుంటాడు. ఒక్కడైనా కడుపు నొప్పి తగ్గించగలుగుతున్నాడా? వాళ్ళు ఎందుకు? ఈ ఫియట్ కార్లు, ఇవి, అవి అని తిరుగుతున్నారు. సాయిబాబాని చూడరాదా? వెంకయ్య స్వామిని చూడరాదా? అక్కలకోట స్వామిని చూడరాదా? వాళ్ళు ఎట్లా ఉన్నారు? అది లేకుండా వీళ్లు ఈ విధంగా తింటున్నారే, మరి ఎన్ని జన్మలకి తీర్చుకునేది వాళ్లది?













GV : మరిప్పుడు సత్య సాయిబాబా ఉన్నారు కదా సార్! మరి ఆయన కార్లలో తిరుగుతున్నారు కదా సార్!

సార్ : కార్లలో తిరిగినా, తినేది మాత్రము, పడుకునేది మాత్రము? అంత నిరాడంబరముగా పడుకుంటాడు అంట, భరద్వాజ మాస్టర్ చెప్పిన మాట అది. జొన్న రొట్టె తింటాడు, నేల మీదనే పడుకుంటాడు, నేల మీద గుడ్డ కూడా వేసుకోడు. ఆయన ఎవరిని, సేవకులను బట్టి తెలుసుకున్నాడో మనకు తెలియదు. ఆయన చెప్పిన మాటలవి. అరే, నువ్వు ఎప్పుడైనా చూసినావంట్రా? ఆయన ఏం తింటాడో? అని అడిగినాడు. వీళ్ళందరూ దొంగ ముండాకొడుకు, అట్టంటివాడు, ఇట్టాంటివాడు అంటుండేది. మీరు ఎప్పుడైనా ఆయనేం తింటారో చూశారా? ఆయన ఎక్కడ పడుకుంటాడో చూసారా? ఆయనకి ఆ సీటు వేశారు, కూర్చోమంటే కూర్చుంటారు. అప్పుడు చెప్పిన మాటలు. నన్ను అల్లాడిపిస్తారు. వీడు తెచ్చాడు పన్నీరు సీసా, అది పోసుకొని స్నానం చేయాలి. ఆ పన్నీరుతో స్నానం చేయకపోతే నేను ఒప్పుకోను, అన్నం తినను, ఉపవాసం (అని మొండి పట్టు పడతారు). అందుకని అది పోసుకొని స్నానం చేసి, రెండు చెంబులు మామూలుగా పోసుకొని స్నానం చేస్తే, ఆ వాసన పోతుంది. కావాలంటే సబ్బేసి కూడా రుద్దుకోవడం అని మాస్టర్ గారు చెప్పింది. నన్ను కూడా అల్లాడిపిస్తారు రా! ఒక భరద్వాజ మాస్టారి భక్తుడు ఇన్ని సపోటా పండ్లు తెచ్చి అక్కడ

పెట్టినాడు. దేవుడి దగ్గరే ఉన్నాయి, పటాల దగ్గర. ఈయన అన్నం తిని వస్తూనే ఒక సపోటా పండు తీసి వలిచి తింటున్నాడు. నాకు ఆశ్చర్యమేసింది. నేనెప్పుడూ చూడలే! ఆయన అలా సపోటా పండు తినటం. ఎప్పుడైనా సిగరెట్ తాగుతూ ఉంటాడు. మేము బిత్తర పోయి చూస్తున్నాము ఆయన తట్టు (వైపు). ఆయనకి మా మనసులో ఏం జరుగుతుందో అప్పుడే తెలుస్తోంది. సుబ్బరామయ్యా! ఇది నేను తినకపోతే వాడు మధ్యాహ్నంకి అన్నం తినడు, అందుకని తినాల్సి వస్తోందయ్యా. మా ముందే కదా తీసుకొచ్చి పెట్టింది. అలా బాధ పెడతారు. బాధ పెట్టినప్పుడు తినాల్సి వస్తుంది, అన్నారు.

అట్లా (ధర్మంగా ఆర్జించినది మాత్రమే ఉపయోగించుకోవటం, ఆహార శుద్ధి, గురుసేవ చేస్తూ మనసు నిశ్చలం చేసుకొనే ప్రయత్నం, విమర్శలకు తావియక పోవటం, కొత్తవి తగిలించుకోకుండటము) చేస్తూ ఉంటే, ఆయనకు ప్రీతి కలిగినప్పుడు, ఆయన ఏమి చేయాలో, అవి చేస్తూ ఉంటాడు. మనం ఉండే పొజిషన్లో తప్పనిసరిగా సాత్వికతను పెంచుకునే సత్సంగము, సద్గ్రంధ పఠనము, సద్గ్రంథ శ్రవణ, ఏ జీవికి సేవ చేస్తున్నా అది భగవంతునికే చెందుతుంది అనే భావన ఇవి చేస్తూ ఉంటే ఏ రోజుకైనా పుణ్యం సమకూరుతుంది. పుణ్యం సమకూరినప్పుడు ఏమి చేయాలో అవి చేస్తుంది, అప్పుడు.

ఎనిమిది సంవత్సరాల వయసులో మాధవ దాసు ఇంట్లోంచి వెళ్లిపోతాడు. మనం వెళ్ళిపోతామా? ఆయనకెందుకు అంటే, పూర్వజన్మ పుణ్యం ఉంది. పుణ్యం లాట్ ఉన్నందువల్లే ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఆయన ఎంత శక్తిమంతుడంటే, నువ్వక్కడ కూర్చోవద్దు,పడుకోవద్దు, వెళ్ళు అన్నదానికి వాళ్లకి కళ్ళు పోతాయి. ఇంకొకచోట కులం చెప్పలేదని చెట్టుకి కట్టేస్తారు ఈ చిన్నపిల్లవాణ్ణి. ఈయన చిన్న పిల్లవాడు అయ్యా! చిన్న పిల్లవాడిని కట్టేస్తే కళ్ళు పోవడమేమిటయ్యా? అంటే, ఇంతకుముందే మహాత్ముడు అయిపోయి ఉన్నాడు. కానీ ప్రారబ్ధము ఎట్లు ఉందో, ఆ ఎరుకల దానికి సేవ చేయాలని, గురువుకి సేవ చేయాలని ఆయన వచ్చినాడు. మనకి కూడా పుణ్యం ఎక్కువ అవుతూ ఉంటే, ఏనాటికైనా తృప్తి, శాంతి, ఆనందాలు రాకుండా ఉండవు. ఆయన (సద్గురువు) ఇస్తూనే ఉంటాడు. మనం చేసే ప్రయత్నాన్ని బట్టి.

GV : మరలా మీరు ఇంకొక మాట చెప్పారు సార్! మీరు ఇంతకుముందు చెప్పినట్లు, ఏ మహనీయుని చరిత్ర చదివినా, దాంట్లో ఇంపార్టెంట్ పాయింట్స్ వ్రాసుకోవాలి అని చెప్పారు.

సార్ : ఆ! ఆలా వ్రాసుకోవాలి. అలా వ్రాసుకోకుండా ఉంటే అసలు ఏమి చేయాలో తెలిస్తే కదా! నాకు చివటం అమ్మ చరిత్ర చదివినామైనా అదొక్కటే గుర్తు. చాలా పాయింట్లు ఉన్నాయి. కానీ ఈ పాయింట్ హృదయానికి

హత్తుకున్నది. నీకు రావడమైన వచ్చునా అంటుంది.  మహనీయుల దగ్గరికి ఎలా రావాలి, ఎలా ఉండాలి, ఎలా పోవాలి అనేది భరద్వాజ మాస్టర్ గారు వివరిస్తారు. షిరిడికి పోయి వచ్చిన తర్వాత ఆ తన్మయత్వం కాపాడుకోవాలి. దీపం గాలిలోకి ఎత్తుకుని పోయి అది ఆరిపోయింది నన్నేమి చేయమంటావు అని కాకుండా.

అట్టనే సిద్ధారూఢ స్వామి చరిత్ర వస్తే ఆ రెండే!

నేను నా కొడుకునే! ఆయన ఎదురు పడినప్పుడు అట్లు అనిపిస్తుందట ఋణానుభంధము.  (నా కర్మము నీ దృష్టి ద్వారము గుండా నీ మనస్సులో చేరినది. అక్కడ అంతర్యామియైన గురువు నిన్ను ప్రేరేపించి, నీ చేత ఈ పని చేయించారు. నా కర్మమును నాకు తినిపించి, తీర్చివేసిన ఆ గురువుకు నా నమస్కారములు!)

తక్కినవన్నీ నాకు immaterial.

నాకు కోపం పోవటమెట్లా, శత్రుత్వం పోవటం ఎట్లా? శత్రుత్వం పోయే దానికి మార్గం ఏమిటి?

ఆయన చెప్పినది, నాకు బాగా అప్పీల్ అయ్యి, నా హృదయానికి పట్టుకున్నది. భరద్వాజ మాస్టర్ చెప్పినప్పుడు - వాడ్ని మీరు  ఎప్పుడు అన్నారు? వాడు కత్తి ఎత్తుకుని వస్తుంటే. వాడ్ని మీరెప్పుడు అన్నారు సార్?

అని నేనంటే "అనలేదు. నువ్వు చెప్పినట్టు, అనుకుందాము. ఇప్పుడు, నేను అన్నాను కనుక అనుకొని నేను గమ్మున రియాక్ట్ కాకుండా ఉంటే, మనకేం నష్టం? ఆ నష్టం ఉంటే వాడు అనుభవిస్తాడు. అంతే కదా!" అది నాకు అర్థం కాలా! ఈ ఋణానుబంధం ఉంటేనే, కంటి ద్వారం గుండా లోపలికి పోతుంది. విశ్వ గురుడి చేత కొడతాడు, తిడతాడు. ఇంకేవో మనస్పర్ధలు వస్తాయి, అనేది అర్థం కాలా అప్పుడు! ఈయన చెప్పినప్పుడు అర్థం అయిపోయింది బాగా.

GV : అంటే ఏమి జరిగినా అలజడి లేకుండా చూస్తూ ఉండాలా?

సార్ : అలజడి లేకుండా ఉండాలి. చూస్తూ ఉండటమే! అవన్నీ కరిగిపోతుంటాయిలే! వెంకయ్య స్వామి చెంప మీద కొడితే, గమ్మునుండల అట్లా! మనం నేర్చుకోవాల్సింది అదే! మీకందరికీ అట్లాంటివి వచ్చి ఉండవు. నాకు మాత్రం వెంకయ్య స్వామి అన్నీ రప్పించినాడు. మక్కెలు విరగదంతాము, తెల్లవారేసరికి వీడ్ని చంపేయాలి, పూరి ఇంట్లో పెట్టి. వేల మంది జనం ఉండేటప్పుడు బండ బూతులు తిట్టడం. నేను మందిరంలో ఉన్నాను, వాడు బయట ఉన్నాడు. ఇవన్నీ పెట్టి వీడు ఎట్లా రియాక్ట్ అవుతాడో చూసినాడు. సరే పో! ఇప్పుడు ఆయన పెద్ద స్వామి అయి, ఇప్పుడు పెద్ద గడ్డము, ఒకాయన స్వామి శిష్యుడు ఆయన చవక ఎత్తుకొని వచ్చాడు కొట్టడానికి. ఆయనకి ఇక్కడ చవక పడుతుందా, పట్టదా, పైన

తగల్తది  అని తెలియదు. ఓ అని చెప్పి వచ్చినాడు ఆయుధ దారియై. దానికి కూడా నేను ఏమీ అనలే, అనుకో, అనుకో మంచిదేలే. స్వామి దగ్గర ఓర్పు వహించి ఉంటే మంచిది. అవతలకి పోయి మనం వెళ్లి పట్టుకోవచ్చు ఆయన్ని. గడ్డం పెట్టి ఒక ఊపు, ఊపి కింద పడేస్తే సరిపోతుంది.  మనం అట్లాంటి పనులకు పోలా!

GV : తృప్తి శాంతులకు చేయవలసిన పనులు వీటిని ఆచరిస్తూ (పూర్తి గాకుండానే సార్ చెప్పటం మొదలు పెట్టారు.)

సార్ : చదివిన దాంట్లో గుర్తుపెట్టుకుని, మరలా వాటిని ఆచరించడానికి ప్రయత్నం చేయటం.  ఎంత మనము ఆచరించడానికి ప్రయత్నం చేస్తే అంత మంచిది. గుర్తుపెట్టుకోవటమే గొప్ప! తరువాత ఆచరించలేదే అని కలుక్కుమంటుంది. నువ్వు ఎప్పుడైతే గుర్తుపెట్టి రాసేశావో, ఈ బ్రెయిన్ లో ఉండి ఎప్పుడూ ఆచరించలేదని కలుక్కు మంటుంది.

**శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి మహారాజ్ కీ జై**



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

## మహాత్ముల వాక్యాలు

*మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.*

*నేను శిరిడీలో వున్నాను, అని అనుకుంటే నన్ను అసలు చూడనట్టే.*



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**